క్లుప్తంగా

క్రిస్మస్ శుభాకాంక్షలు



వెంకట ప్రతాప్ అప్పారావు, ఎమ్మెల్యే

నూజివీడు: నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆదివారం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. లోక రక్షకుడైన ఏసుక్రీస్తు సమస్త మానవాళికి ప్రేమ, కరుణ, దయ, శాంతి మార్గం చూపారని పేర్కొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

తిరువూరు: క్రిస్మస్ పర్వదిన సందర్భంగా తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. శాంతి, దయ, కరుణ ప్రేమ ప్రపంచానికి చాటిచెప్పిన ఏసుక్రీస్తు జన్మదినం క్రైస్తవులకు అత్యంత సంతోషకరమైన పండుగని పేర్కొన్నారు.

అక్షింతల ఊరేగింపు



గంపలగూడెం: అయోధ్య రామయ్యను తాకిన అక్షింతలను ఆదివారం గంపలగూడెంలో వీరాంజనేయస్వామి భక్తబృందం, హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఊరేగించారు. తొలుత అక్షింతలను షిర్డీసాయిబాబా ధ్యాననిలయానికి తీసుకొచ్చి వీరాంజనేయస్వామి విగ్రహం ఎదుట పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల వెంట అక్షింతలతో ఉన్న కలశాలను భక్తులు ఊరేగించారు. చివరికి సీతారామచంద్రస్వామి ఆలయానికి తీసుకొచ్చారు. అక్షింతలను వచ్చే ఆదివారం మండలంలోని అన్ని గ్రామాలకు పంపిణీ చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

కల్యాణమండప నిర్మాణానికి వితరణ




మెట్టగుట్ట(గంపలగూడెం): పెనుగొలను శివారు మెట్టగుట్ట శేషాచల శ్రీనివాసస్వామి ఆలయంలో నిర్మిస్తున్న కల్యాణ మండపానికి ఒక భక్తుడు ఆదివారం రూ.50,116 వితరణగా అందజేశారు. మండలంలోని తునికిపాడు గ్రామానికి చెందిన బుర్రి నాగేశ్వరరావు ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు జొన్నల ప్రతాపరెడ్డికి అందజేశారు.

కళ్లజోళ్ల పంపిణీ



నూజివీడు: స్వచ్ఛంద సంస్థల సహకారంతో ట్రిపుల్ ఐటీ, హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని నూజివీడు డైరెక్టర్ ఆచార్య ఎం.చంద్రశేఖర్ అన్నారు. స్థానిక ట్రిపుల్ ఐటీలో ఇటీవల నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో కళ్లజోళ్లు అవసరమని గుర్తించిన విద్యార్థులకు ఆదివారం హెల్పింగ్ హ్యాండ్స్ సహకారంతో అశ్వని ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళ్లజోళ్లను అందజేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డైరెక్టర్ మాట్లాడుతూ 1,262 మంది విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు బ్రహ్మస్వాములు, ప్రధాన కార్యదర్శి మధు, సభ్యులు సలీంబాబు, వేణుగోపాల్, అశ్వని ఫౌండేషన్ ట్రస్టు సభ్యులు పడాల రమేష్, పరిమిశెట్టి రాజశేఖర్, ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య గోపాలరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుల నియామకం



వినోద్ | సురేష్ | అలీరెహ్మాన్

తిరువూరు: వైఎస్సార్ సీపీ తిరువూరు మండల, పట్టణ యువజన విభాగాల అధ్యక్షులను రాష్ట్ర పార్టీ నియమించింది. తిరువూరు మండల విభాగ అధ్యక్షుడిగా కొండూరు వినోద్ (చౌటపల్లి), తిరువూరు పట్టణ అధ్యక్షుడిగా వాళ్ల సురేష్ నియమితులయ్యారు.


విస్సన్నపేటలో..

విస్సన్నపేట: వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడిగా విస్సన్నపేటకు చెందిన షేక్ అలీరహ్మాన్‌ను నియమించారు. ఆదివారం అలీ మాట్లాడుతూ తనను నియమించినందుకు ఎమ్మెల్యే కె రక్షణనిధి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ

రెడ్డిగూడెం: పాడి రైతుల శ్రేయస్సు లక్ష్యంగా కృష్ణామిల్క్ యూనియన్ పనిచేస్తుందని బోర్డు డైరెక్టర్ ఉయ్యూరు అంజిరెడ్డి అన్నారు. కొత్తరెడ్డిగూడెం పాల కేంద్రం నందు ఆదివారం యూనియన్ అందించిన బోనస్‌ను ఆయన పాల ఉత్పత్తిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022-23 సంవత్సరానికి ఇప్పటి వరకు యూనియన్ రెండు దఫాలుగా బోనస్‌ను అందజేయడం జరిగిందని రూ. 6.63 లక్షలు ఇప్పటికే వరకు సభ్యులకు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఆదివారం రెండో దఫా రూ. 3.06 లక్షలను పాల ఉత్పత్తిదారులకు అందజేశామని తెలిపారు.

క్రిస్మస్‌కు చర్చిలు ముస్తాబు



విద్యుత్ దీపాల వెలుగులతో ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లిలోని ఆర్పీఎం చర్చి



మైలవరంలో ఆర్సీఎం చర్చిలో ఏర్పాటు చేసిన పశువుల పాక



గంపలగూడెం మండలం తోటమూలలో విద్యుత్ కాంతులతో ఆర్సీఎం చర్చి



రెడ్డిగూడెంలోని వెలగలగూడెంలో ఆర్సీఎం చర్చి



విద్యుద్దీపాలంకరణలో తిరువూరులోని ఆర్సీఎం చర్చి

నూజివీడు: క్రిస్మస్ సందర్భంగా ఆదివారం పట్టణంలోని పలు చర్చిలు ముస్తాబయ్యాయి. మిరుమిట్లు గొలిపే లైటింగులతో ముచ్చటగొలుపుతున్నాయి. ఏసుక్రీస్తు జన్మదినాన్ని వైభవంగా జరుపుకునేందుకు క్రైస్తవులు సిద్ధమయ్యారు. విద్యుత్‌కాంతుల్లో చర్చిలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. రాజీవ్‌సర్కిల్ వద్ద మేరీమాత చర్చి, సమతానగర్‌లోని సీఎస్ఐ టౌన్ చర్చి, నెహ్రూపేటలోని ఆర్‌సీఎం చర్చి, అజరయ్యపేటలోని సీఎస్ఐ చర్చి, ఎస్‌డీఏ చర్చిలు విద్యుద్దీపాల కాంతులతో ఆకట్టుకుంటున్నాయి.

చాట్రాయిలో..

చాట్రాయి: క్రిస్మస్ సందర్భంగా మండలంలోని చర్చిలు రంగురంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబయ్యాయి. చనుబండ, చాట్రాయి, కోటపాడు, చిత్తపూరు ఆర్‌సీఎం, చనుబండ, సూరంపాలెం, నరశింహారావుపాలెం, పోలవరం సీఎస్ఐ చర్చిల్లో అర్ధరాత్రి నుంచి క్రైస్తవులు ప్రార్థనలు నిర్వహించనున్నారు.

మైలవరంలో..

మైలవరం: క్రిస్మస్‌ను పురస్కరించుకుని మైలవరంలోని క్రీస్తు ఆలయాలు రంగు రంగుల విద్యుత్ దీపాలతో నూతన సొబగులు సంతరించుకున్నాయి. మైలవరం శాంతి నగర్‌లోని ఆర్‌సీఎం చర్చిలో క్రీస్తు పుట్టుకను తెలియజేసే విధంగా విశ్వాసులు పశువుల పాకను ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: క్రిస్మస్‌ను ఘనంగా నిర్వహించేందుకు మండలంలోని పలు గ్రామాల్లో చర్చిలను సిద్ధం చేశారు. గంపలగూడెం, తోటమూల, మేడూరు, చల్లగుండ్లవారిపాలెం, పెనుగొలను, ఊటుకూరు, వినగడప, గుళ్లపూడి, అమ్మిరెడ్డిగూడెం, గోసవీడు తదితర గ్రామాల్లో చర్చిలకు రంగులు వేయడంతోపాటు విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేశారు.

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: మండలంలోని పలు గ్రామాల్లో చర్చిలను అందంగా ముస్తాబు చేశారు. వెలగలగూడెంలోని ఆర్‌సీఎం చర్చి, రెడ్డిగూడెంలోని సీఎస్ఐ చర్చి, మండలంలోని పలు గ్రామాల్లోని చర్చిలను ముస్తాబు చేశారు.

తిరువూరులో..

తిరువూరు: క్రిస్మస్‌ను పురస్కరించుకుని తిరువూరు మండలంలోని చర్చిలలో ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక ప్రార్థనల నిర్వహణకు చర్చిలను సిద్ధం చేశారు. తిరువూరులోని ఆర్సీఎం చర్చి, సీఎస్ఐ, క్రాస్ బాప్టిస్టు, తెలుగు బాప్టిస్టు తదితర చర్చిలు విద్యుద్దీపాలంకరణ గావించారు. క్రిస్మస్ సందర్భంగా రెడీమేడ్, వస్త్ర దుకాణాలు వినియోగదారులతో కిటకిటలాడుతున్నాయి.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: క్రిస్మస్ వేడుకలకు మండలంలోని పలు గ్రామాల్లోని చర్చీలు ముస్తాబయ్యాయి. ఆర్పీఎం, సీఎస్ఐ, ఇతర సంఘాల చర్చిల్లో ఏసుక్రీస్తు పుట్టిన రోజు పురస్కరించుకుని ఆదివారం అర్ధరాత్రి నుంచి ప్రార్థనలు జరిపేందుకు రంగులు వేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: క్రిస్మస్ సందర్భంగా మండలంలోని పలు చర్చిలను విద్యుతు దీపాలతో అలంకరించారు. స్థానిక నూజివీడు రోడ్డులో, పుట్రేల రోడ్డులో ఉన్న ఆర్పీఎం చర్చిల వద్ద స్టార్‌లు, పశువులపాకను ఏర్పాటు చేసి బాల ఏసు ప్రతిమలను అందంగా అలంకరించారు.

ముసునూరులో..

ముసునూరు: మండల వ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలకు క్రైస్తవ ఆలయాలు ముస్తాబయ్యాయి. రమణక్కపేట, ముసునూరు, లోపూడి, వలసపల్లి, వేల్పుచర్ల, కాట్రేనిపాడు, చెక్కపల్లిల్లోని ఆర్‌సీఎం చర్చిలు, ముసునూరు, చింతలవల్లి, చెక్కపల్లి, గోపవరం సీఎస్ఐ చర్చిలు, ముసునూరు, కాట్రేనిపాడు, వేల్పుచర్లల్లోని రక్షణ సైన్యం చర్చిలు, బెరాకా ప్రార్థనా మందిరం, ఏఎంజీ తదితర చర్చిలను విద్యుద్దీపాలతో అలంకరించారు.



నూజివీడు రాజీవ్ సర్కిల్ వద్ద విద్యుత్ వెలుగుల్లో మేరీమాత చర్చి



చనుబండ ఆర్‌సీఎం చర్చి

భక్తిశ్రద్ధలతో హనుమత్ వ్రతాలు



మైలవరం ఆంజనేయస్వామి ఆలయంలో హనుమత్ వ్రతంలో పాల్గొన్న దంపతులు



24టీఆర్‌వీ24- మేడూరులో సామూహిక హనుమత్ వత్రంలో భక్తుల

మైలవరం: స్థానిక ద్వారకా తిరుమల దేవస్థానం దత్తత దేవాలయం ఆంజనేయస్వామి గుడిలో జరుగుతున్న హనుమత్ దీక్షా పీఠం 32వ వార్షిక కార్యక్రమాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ద్వారకా తిరుమల దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త, చైర్మన్ ఎస్వీ సుధాకరరావు ఆధ్వర్యంలో హనుమత్ వ్రతాలు జరిగాయి. ఉదయం నుంచి నాలుగు విడతలుగా జరిగిన వ్రతాల్లో 120మంది దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామోత్సవం నిర్వహించారు. వ్రతాలు పూర్తయిన అనంతరం జూలూరు పాపయ్య సౌజన్యంతో అన్నప్రసాద వితరణ జరిగింది. స్థానిక రామకృష్ణ కాలనీలో వారం రోజులుగా నిర్వహించిన హనుమత్ వ్రతాలు, హనుమత్ పారాయణ కార్యక్రమం ముగింపు సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.

గంపలగూడెంలో..

గంపలగూడెం: మండలంలోని మేడూరు వీరాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం సామూహిక హనుమత్ వత్రాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గంపలగూడెం సీతారామచంద్ర స్వామి ఆలయంలోని వీరాంజనేయస్వామి ఉప ఆలయం వద్ద సామూహిక హనుమత్ వత్రాన్ని నిర్వహించారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



కాట్రేనిపాడులో క్యాండిల్ ర్యాలీ



కొండపల్లిలో క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్‌చేస్తున్న ఎంపీపీ జోత్స్న



గొల్లపూడిలో క్రీస్తు జననం నృత్యరూపకం

ముసునూరు: క్రీస్తు బోధనలు వెలుగుమయం, ఆ వెలుగు చూపుతున్న ప్రేమ, శాంతి మార్గాల్లో అందరూ జీవించాలని రాజమండ్రికి చెందిన ప్రముఖ సువార్త ప్రసంగీకుడు అబ్రహం అన్నారు. కాట్రేనిపాడులోని సీఎస్ఐ హోలీ నూతన మందిర ప్రాంగణంలో సంఘ కాపరి, మండల పాస్టర్స్ ఫెలోషిప్ ప్రధాన కార్యదర్శి కంబాల రాంబాబు ఆధ్వర్యంలో అధ్యక్షుడు బి.ఏసుదాసు అధ్యక్షతన శనివారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఉపాధ్యక్ష, కోశాధికారులు ప్రభు కిషోర్, రాజు సంఘ విశ్వాసులతో గ్రామ వీధుల్లో క్యాండిల్ సర్వీస్‌తో భారీ ర్యాలీ నిర్వహించి, అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. సంయుక్త కార్యదర్శి, కమిటీ సభ్యులు బాలస్వామి, జోజి, అబ్రహాం ఆధ్వర్యంలో కొత్త సంవత్సరం క్యాలెండర్లను విడుదల చేశారు. సలహాదారు సంసోన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అందరికీ పంచారు. సంఘ విద్యార్థులు ప్రదర్శించిన క్రీస్తు జనన సంబంధిత నృత్య ప్రదర్శనలు, నాటికలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పలుప్రాంతాల విశ్వాసులు హాజరయ్యారు.

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపలి 27వ వార్డు కౌన్సిలర్ చైతన్య ప్రవంతి, వైఎస్సార్ సీపీ నాయకుడు ఆనంద్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ఎంపీపీ పాలడుగు జోత్స్న వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి కేక్ కట్‌చేశారు. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎంపీపీ దంపతులను సత్కరించారు. టౌన్ అధ్యక్షుడు మిక్కిలి శరభయ్య, పాలడుగు దుర్గాప్రసాద్, షాబూఖారీ మసీదు మతగురువు ఆల్తాఫ్‌రజా, వార్డు కౌన్సిలర్‌లు పాల్గొన్నారు. షాబూఖారీ మసీదులో జరిగిన కార్యక్రమంలో పాస్టర్ మోగులూరి ఎలీషాను ఘనంగా సత్కరించి కేక్ చేశారు. మత గురువు మహ్మద్ ఆల్తాఫ్‌రాజా పాల్గొన్నారు.

గొల్లపూడిలో..

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడిలోని ఎన్ఆర్ఐ ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. నర్సరీ నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు క్రిస్టమస్ ట్రీ గొప్పతనాన్ని, అదే విధంగా క్రీస్తు జననం గురించి ప్రదర్శించిన నృత్య రూపకం ఆహూతులను ఆకట్టుకుంది. స్కూల్ ప్రిన్సిపాల్ వాణి కుమారి, ఎన్ఆర్ఐ కళాశాల ప్రిన్సిపాల్ రాంబాబు, ఇండియన్ స్ప్రింగ్స్ స్కూల్ జాయింట్ సెక్రటరీ కొమ్మారెడ్డి చైతన్య, స్కూల్ కో-ఆర్డినేటర్ సుష్మిత, ఇన్‌చార్జ్ బాషా, మాధవి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



ఆగిరిపల్లి: నరసింగపాలెం పీఏసీఎస్ బ్యాంక్ డైరెక్టర్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మందపాటి విజయకుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, అతని కుటుంబాన్ని, వైఎస్సార్ సీపీ కార్యకర్త లాం అబ్రహం కుటుంబాన్ని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆదివారం పరామర్శించారు. బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని ధైర్యం చెప్పారు.

‘ఆడుదాం ఆంధ్రా’కు సర్వం సిద్ధం

నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 నుంచి నిర్వహించే ‘ఆడుదాం ఆంధ్రా’ క్రీడా సంబరాలకు మండలంలోని పలు హైస్కూళ్లలో ఏర్పాట్లు శరవేగంగా చేస్తున్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ డబుల్స్‌లో 18 ఏళ్ల పైబడిన యువతీ యువకులకు గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో పోటీలను నిర్వహిస్తారు. ఈ పోటీల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులకు నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నగదు బహుమతులను ప్రభుత్వం అందజేస్తుంది. క్రీడల ద్వారా ఆరోగ్యవంతమైన జీవనశైలిని ప్రోత్సహించడం, ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావడం, క్రీడా నైపుణ్యాన్ని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. గ్రామస్థాయిలో ఈ పోటీల నిర్వహణకు మండలంలోని పలు హైస్కూళ్లను గుర్తించారు. దిగవల్లి, యనమదల, మీర్జాపురం, పల్లెర్లమూడి హైస్కూళ్లలో పోటీలను నిర్వహించనున్నారు. ఆయా హైస్కూళ్లలో పోటీల నిర్వహణకు గాను కోర్టుల ఏర్పాటులో పీఈటీలు, పీడీలు నిమగ్నమయ్యారు. దిగవల్లి హైస్కూల్ పరిధిలో దిగవల్లి, తూర్పు దిగవల్లి, హనుమంతులగూడెం, అన్నవరం, ముక్కొల్లుపాడు, వెంకటాయపాలెం, కొత్తూరు తండా, ఓగిరాల తండాలకు చెందిన వారు, యనమదల హైస్కూల్లో యనమదల, బత్తులవారిగూడెం, సిద్ధార్థనగర్, సుంకొల్లు, బోర్వంచ, పాతరావిచర్ల, కొత్తరావిచర్ల, పోతురెడ్డిపల్లి, మీర్జాపురం హైస్కూల్‌లో మీర్జాపురం, తుక్కులూరు, గొల్లపల్లి, పోలసానపల్లి, మొర్సపూడి, దేవరగుంట, జంగంగూడెం, పల్లెర్లమూడి హైస్కూల్‌లో పల్లెర్లమూడి, సీతారామపురం, ఎంఎస్‌పాలెం, మర్రిబంధంలకు చెందిన క్రీడాకారులకు పోటీలు నిర్వహిస్తారు. పట్టణంలో సెయింట్‌థామస్ హైస్కూల్, డీఏఆర్ కాలేజీ, ఎస్ఆర్ఆర్ బాలుర హైస్కూళ్లలో పోటీలు నిర్వహిస్తారు. మండలంలో, పట్టణంలో కలిపి 15 మంది పీడీలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఏర్పాట్లను ఎంపీడీఓ వీఏ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్ పర్యవేక్షిస్తున్నారు.

ఘనంగా గీతా జయంతి

ముసునూరు: భక్తుల గోవింద నామస్మరణలు, వేద మంత్రోచ్చరణలు, తాళం భజనల నడుమ సంప్రదాయ రీతిలో వైభవంగా గీతా జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం గీతాపారాయణ నిర్వహించారు. చెక్కపల్లిలో మహిళా భక్తులు కలశాలు చేతబూని కోదండ సీతారామస్వామి వారి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం సమరసత సేవా ఫౌండేషన్ ప్రచారక్ పరమేశ్వరరావు ఆధ్వర్యంలో అష్టోత్తర శతనామావళి, పూజా కైంకర్యాలు నిర్వహించి, అత్యంత భక్తిశ్రద్ధలతో భగవద్గీతా పారాయణం గావించారు.

పీఎం కిసాన్ కోసం దరఖాస్తు చేసుకోండి

గంపలగూడెం: 2019వ సంవత్సరం తర్వాత వ్యవసాయ భూములకు కొత్త పాస్ పొందిన రైతాంగం పీఎం కిసాన్ పొందేందుకు ప్రభుత్వం ప్రస్తుతం అవకాశం కల్పించినట్లు వ్యవసాయాధికారి బీ సాయిశ్రీ తెలిపారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా పీఎం కిసాన్ శాచురేషన్ డ్రైవ్ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బంది చేత నూతన పట్టాదారు పాస్‌పుస్తకం ఖాతా నంబర్‌కు ఆధార్ నంబర్ అనుసంధానం చేయాలని తెలిపారు. బ్యాంక్ అకౌంట్‌కు కూడా ఆధార్, సెల్ నంబర్ అనుసంధానం చేయాల్సి ఉందని పేర్కొన్నారు. పీఎం కిసాన్ యాప్‌లో కమ్యూనిటీ సర్వీసు సెంటర్ల ద్వారా ఈకేవైసీ కూడా 2024 జనవరి 15వ తేదీ లోపు చేయించుకోవాలని తెలిపారు.

వీరాంజనేయస్వామికి మకరతోరణం అందజేత



గంపలగూడెం: స్థానిక సీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలోని వీరాంజనేయస్వామికి గంపలగూడెంకు చెందిన కొల్లా సుబ్రహ్మణ్యం, సముద్రాల నరేంద్ర, బొడ్డు రామకృష్ణ, సుంకర నాగేశ్వరరావు ఇత్తడి కవచం, మకరతోరణాన్ని ఆలయ వైస్ చైర్మన్ కోదండ రామ్‌కు ఆదివారం అందజేశారు. అర్చకులు దేవయజనం శ్రీధరాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామికి అలంకరించారు.

రేపు ఆడుదాం ఆంధ్రా క్రీడలు ప్రారంభం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు మంగళవారం ప్రారంభమవుతాయని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీటీపీఎస్ క్రీడా మైదానంలో 26 నుంచి 31వ తేదీ వరకు క్రీడాపోటీలు ఉంటాయని పేర్కొన్నారు. టోర్నీలో క్రికెట్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, షటిల్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే పేర్లు రిజిస్టర్ చేసుకున్న క్రీడాకారులు ఆ రోజు ఉదయం పాల్గొనాలని కమిషనర్ కోరారు.